# శ్రుతి మీద కృష్ణ




"ఇదుగోనండీ కరెంటు బిల్లు" అంటూ బిల్లు తెచ్చి టేబిల్ మీద పెట్టింది లక్ష్మి. దాన్ని చేతిలోకి తీసుకొని చూసి "అరె ఇరవై నాలుగు రూపాయ లయిందే" అని దాన్ని తిరిగి లక్ష్మిచేతిలో పెట్టి "తీసుకువెళ్లు" అన్నాడు ప్రకాశరావు.

"నేను వచ్చింది ఇచ్చేందుకుకాని తిరిగి తీసుకు వెళ్ళేందుకు కాదు" అని విసురుగా వెళ్ళిపోయింది లక్ష్మి.

"ఎంత పొగరుగా మాట్లాడుతూంది" అన్నాడు ప్రకాశరావు కోపంగా.

"ఇచ్చిన చనువునుబట్టే అలాగే అంటుంది మరి" అంది కృష్ణవేణి పక్కవాటా శారదనుద్దేశించి.

"సరేకాని కరెంటుబిల్లు మరీ అంత అయిందేమిటి?"

"ఏమో నాకేం తెలుసూ? మనకు రేడియోలేదు, ఇస్త్రీపెట్టెలేదూ" అంది సాగదీస్తూ. అవన్నీ శారదా వాళ్ళకి ఉన్నాయి. వారం రోజుల కొకసారి బట్టలన్నీ శుభ్రంగా ఉతికించి కరెంట్ఇస్త్రీపెట్టె పెట్టి లక్ష్మి చేత ఇస్త్రీ చేయిస్తుంది శారద. ఇక రేడియో శారద ఉన్నంతసేపూ మోగుతూనే ఉంటుంది. అలా రేడియో ఆస్తమానం మోగుతూండటం మోడరన్ ఫాషన్ అని శారద అభిప్రాయం. శారద సినిమాకి వెళ్లినా షికారుకి వెళ్లినా లోపలలైట్లు అలాగే ఉంచివెళుతుంది. వరాండాలో లైటు రాత్రిఅంతా వెలుగుతూనే ఉంటుంది. శారద ఇంట్లోఉన్నంతసేపూ తలుపులు బిడాయించి ఫాను వేస్తుంది. మరి కరెంటుబిల్లు తక్కువెలా అవుతుంది?

కృష్ణవేణి ఇంట్లో కరెంటు చాలా పొదుపుగా వాడుతారు. రేడియో ఉంటే పిల్లల చదువు పాడవుతుందని తన పెద్ద కొడుకు బలరాం కాలేజీలోచేరిన మరునాడే దాన్ని తన చెల్లెలికి పంపించాడు ప్రకాశరావు కృష్ణవేణి వాళ్లింట్లో ఉన్నది బొగ్గుల ఇస్త్రీపెట్టె. టేబిల్‌ఫాను ఉంది కాని చాలా అరుదుగా వాడతారు. శారదావాళ్ళు రాకముందు ఉన్న ఆఫీసరుగారి భార్యకూ కృష్ణవేణికీ చాలా స్నేహం.

"మా కయినదాంట్లో సగం వంతు కూడా కాదు మొత్తం కృష్ణవేణీ మీ కరెంటుబిల్లు" అనేది ఆవిడ నవ్వుతూ.

చెరిసగం కడదామంటే వినిపించుకునేది కాదు. మూడింట ఒక వంతు ఇవ్వమనేది. వాళ్ళు ఉన్నంతకాలం ఎలాంటి పేచీలూ రాలేదు, కరెంటుబిల్లు విషయంలో. శారదా వాళ్ళు వచ్చినప్పటినుంచి చెరిసగం కట్టడం మొదలు పెట్టారు. ఇంతవరకూ ఏ గొడవాలేదు. మరి ఈ వేళ లక్ష్మితెచ్చినబిల్లు తీసుకువెళ్లమంటే తీసుకువెళ్లకుండా ఇక్కడే పడవేసిపోయింది. ఇదేదో శారదపన్నాగం అయి ఉంటుంది అనుకుంది కృష్ణవేణి. ఆవిడికి గిట్టింలో

జరిగిన కొన్ని సంగతులు గుర్తుకు వచ్చాయి.

*  *  *

అది ఒక చక్కని ఇల్లు. చుట్టూ చక్కనితోట. పైకి చూడటానికి చాలా అందంగా ఉంటుంది. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. ఆ ఇల్లు రెండు వాటాలుగా విభజించబడింది కాని రెండిటికి కలిపి ఒకటే మీటరు. ఒక వాటాలో కృష్ణవేణి, ప్రకాశరావు దంపతులు ఆరుగురు పిల్లలతో ఉంటున్నారు. అద్దె తొంభై రూపాయలు. ఇంకొకవాటాలో ఇదివరకొక పెద్ద ఆఫీసరెవరో అద్దెకి ఉండేవాడు. ఆయన సంవత్సరం కిందటే ట్రాన్స్‌ఫర్ అయివెళ్ళిపోయాడు. ఆయన ఖాళీ చెయ్యగానే ఇంటి అద్దెను నూటయాభైనించి నూటఇరవై అయిదు చేసింది ఇంటి బామ్మగారు. నాలుగు నెలలకిందటే శారదా కృష్ణారావు దంపతులు ఇద్దరు పిల్లలతో ఆ వాటాలో ప్రవేశించారు. ఆ రోజు మధ్యాహ్నమే వచ్చి కృష్ణవేణితో పరిచయం చేసుకుంది శారద. కృష్ణారావు అదేదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడనీ, జీతం అయిదు వందలపైన అనీ, తాను పి. యు. సి. పాస్ అయినాననీ గర్వంగా చెప్పుకుంటుంది. ఆ తరవాత ఏవేవో కబుర్లు దొర్లాయి. ఆవిడ ఎంతో కలుపుగోలుమనిషిలా కనిపించింది కృష్ణవేణికి మాటలసందర్భంలో.

"మీరు పనిమనిషికి ఎంత ఇస్తారు?" అని అడిగింది శారద. "ఆరురూపాయలిస్తానండీ. అంట్లు తోము తుంది. ఇల్లు తుడుస్తుంది. మిగతా పని అంతా నేనే చేసుకుంటాను. అసలు ఈ కాలపు పనిమనుషులవంటిది కాదండీ ఇది. చేసిన పని చాలా శుభ్రంగా చేస్తుంది. పని చెయ్యడం మొదలుపెట్టి సంవత్సరం అయింది కాని ఒక వస్తువు పోవడంఅంటూ కాని, ఓ మాటా పలుకూ అంటూగాని లేదు. అలాంటి మనుషులు దొరకడం ఈ రోజుల్లో అరుదనుకోండి" అని, అంతటితో ఆగకుండా "మా ఒక్క ఇంట్లో పని చేస్తోంది. వేరే ఇల్లు లేదు" అని కూడా అంది కృష్ణవేణి.

"అయితే మాకు కూడా పని చేస్తుందేమో కనుక్కోండి. ఊరు కొత్త మాకు. ఎవరెలాంటివాళ్లో తెలీదు."

"అలాగే"నంది కృష్ణవేణి. ఆ తరవాత తమ పిలవాడిని శారదావాళ్లకూ కూడా పొయ్యమని చెబుతానంది. కాస్సేపుండి వెళ్ళిపోయింది శారద.

ఆవిడ అటు వెళ్లిన అయిదు నిమిషాలకు పనిమనిషి లక్ష్మి వచ్చింది. చీపురు పట్టుకొని ఇల్లు తుడవడాని కుపక్రమించింది. సాధారణంగా కృష్ణవేణి దగ్గిర ఉండి చిమ్మిస్తుంది ఇల్లు. లేకపోతే పనిమనుషులు సరిగ్గా చిమ్మరనీ, చేతికి దొరికిందేదో పట్టుకుపోతారనీ ఆవిడ అభిప్రాయం. ఆ రోజు మాత్రం ఏదో పనిమీద వంటింట్లోకి వెళ్ళింది కృష్ణవేణి.

"అమ్మగారూ, ఇదేందో ఉంగరం వాగున్నాది. సినబాబుగోరిదేటి?" అంటూ చిన్న నీలంరాయి ఉంగరం తెచ్చి వంటింటికవతలగా నిలుచుని కృష్ణవేణిచేతిలో పెట్టింది లక్ష్మి.

లక్ష్మి నిజాయితీకి కృష్ణవేణి పొంగిపోయింది. ఇంకొకరైతే దొరికిందే చాలని పట్టుకుపోయేవారు.

"అబ్బే ఇది చినబాబుది గాదు. ఇందాక వాళ్ల పాప చేతికి చూశాను. ఉండు. అడుగుతాను" అంటూ పెరట్లోకి వెళ్ళి శారదను కేకవేసి పిలిచింది.

"ఇదిగో చూడండి ఈ ఉంగరం మీ పాపదేమో! మా ఇంట్లో పడిఉంది" అంటూ ఆ ఉంగరం చూపించింది.

"అవునండీ మా పాపదేను. ఎక్కడ ఉంటే అక్కడే పడేస్తుంది. చాలా థాంక్స్" అంటూ ఆ ఉంగరం అందుకుంది శారద.

"మా పనిమనిషి చిమ్ముతుంటే దొరికింది లెండి."

లక్ష్మికూడా కృష్ణవేణి వెనకనే నిలుచునికొత్తవాళ్లను కుతూహలంగా చూస్తోంది.

"అక్కడ పని అయినాక ఒకసారి రా, నీతో మాట్లాడాలి" అంది శారద లక్ష్మితో. అర్థంకాక

**చావలి సీత**

ఎందుకన్నట్లు చూసింది లక్ష్మి కృష్ణవేణి వంక. "వాళ్లు కూడా నిన్ను పనికి పెట్టుకుంటారుట" అంది కృష్ణవేణి.

తన పని పూర్తికాగానే శారదా వాళ్ళ వాటాలోకి వెళ్లింది లక్ష్మి. వెళ్లగానే కాఫీ ఇచ్చింది శారద. తెల్లబోయి చూసింది లక్ష్మి.

"నీకే తీసుకో."

"నా కలవాటు లేదండీ."

"అలవాటు లేకపోతే తాగకూడదా ఏమిటి? తీసుకో ఫరవాలేదు." తాగకతప్పిందికాదు లక్ష్మికి. కృష్ణవేణి ఎప్పుడూ కాఫీ ఇవ్వలేదు లక్ష్మికి.

"వాళ్లు నీకు ఎంతిస్తారు?"

"ఆరు రూపాయలిత్తారండీ! అంట్లు తోమడం, ఇల్లు తుడవడమేనండీ! మిగతా పన్లన్నీ ఆరే సేసుకుంటారు."

"మా ఇంట్లో అంత ఎక్కువగా గిన్నెలు పడవు. ఉండేది నేనూ నా ఇద్దరు పిల్లలూను. మా ఆయన నెలకి ఇరవై రోజులు కాంపులోనే ఉంటారు. ఇక ఇల్లు తుడవడం, బట్టలు ఉతకడం, షాపుకువెళ్ళి సరుకులు తేవడం చెయ్యాలి. ఎంత ఇమ్మంటావు?" లక్ష్మికి ఏం మాట్లాడాలో తెలియలేదు.

"వేణమ్మగారిని కనుక్కొని చెబుతానండి" అంది చివరికి.

"ఈ కాస్తకు అవిణ్ణి అడగడమెందుకు? పన్నెండు రూపాయలిస్తాను ఏమంటావు?"

లక్ష్మి తన చెవులను తానే నమ్మలేకపోయింది. పన్నెండు రూపాయలు! తనకు నెలకు పన్నెండు రూపాయలు!

"అలాగేనండీ పట్టు తారీకునుండి మొదలెడతాను" అంది సంతోషంగా.

"అంతదాకా ఎందుకు? ఇవాళ తారీఖు పది. రేపటినించి మొదలెట్టు."

"అలాగే" నంటూ వెళ్లిపోయింది లక్ష్మి.

పక్కగదిలోనుంచి ఈ సంభాషణ అంతా వింటూన్న కృష్ణారావు ఉస్సురని నిట్టూర్చాడు. కృష్ణారావుది గుంటూరుజిల్లాలోని చిన్నపల్లెటూరు. ఎం. ఏ. పాసై ఉద్యోగం చేస్తున్నా అతనికెవరూ పిల్లనివ్వడానికి రాలేదు. అతని అక్క ఆ కుటుంబానికి మాయనిమచ్చ తేవడమే దానికి కారణం.

చివరికి ఒక పిల్ల వదిలినా వదిలిందేనన్న ఉద్దేశ్యంతో ఆరుగురు ఆడపిల్లలుగల శారదతండ్రి శారదను కృష్ణారావుకిచ్చి చేశారు. శారద పల్లెటూరిపిల్ల. చౌకబారు నవలలు చదివి అందులోని జీవితమే స్వర్గమని భావించి తనకూ అలాంటి జీవితమే కావాలని కోరుకొనే యువతి. అనుకోకుండా నెలకు మూడు వందలయాభై సంపాయించే భర్త దొరకడంతో ఆమెకు పట్టపగ్గాలు

డాక్టర్‌వాసూస్

కేశరాజ్ హెయిర్ ఆయిల్

మెడికేటెడ్ పెర్ఫ్యూమ్డ్

అకాలములో జుట్టు నెరియుట, పలచబడుట, చుండ్రు పోవుటలను మాన్పును.

నిరంతర మానసిక పరిశ్రమవలన వేడెక్కి, మొద్దుబారిన మెదడుకు చలువచేసి పునరుత్తేజపరచును.

ఎండ, నిద్రలేమి, మానసిక పరిశ్రమలవల్ల వచ్చు తలనొప్పి, కళ్లమంటలు, పోటు, నీరు కారుటలను మాన్పును.

ఆరోగ్యవంతమైన కేశ సంపదను వృద్ధిపరచి అందమును పెంపొందించును.

కేశ సౌందర్యమునకు సాటిలేనిది కేశరాజ్ హెయిర్ ఆయిల్



మీ కేశములకు సంబంధించిన సమస్యలకు శాస్త్రీయమైన సలహా కావాలా?

వివరములతో వుత్తరం వ్రాయండి.

కెమిస్ట్స్ & డ్రగ్గిస్టు డిపార్టుమెంటు:

డాక్టర్ వాసూ ప్రోడక్ట్స్,

రాజమండ్రి-2

4

